
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల

జిల్లా వార్తలు

5

బుధవారం 18 జూన్ 2025

రెడ్‌క్రాస్ చైర్మన్‌కు అభినందనలు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ప్రిన్సిపల్ సెక్రటరీ, గవర్నర్ దాన కిశోర్‌ను మంగళవారం రాజ్‌భవన్‌లో మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రావులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకుకు సొంత భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని, రక్తనిధి కేంద్రానికి రాష్ట్ర శాఖ నుంచి రక్త నిల్వలు సమకూర్చాలని విన్నవించారు. ఈ విషయాలపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాములు, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ అంధుల పాఠశాలలో అడ్మిషన్లు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కరీంనగర్ అంధుల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం, 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందన్నారు. అభ్యర్థులు 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండి , జిల్లా మెడికల్ బోర్డుచే జారీ చేయబడిన సదరం సర్టిఫికెట్ 40 నుంచి 100 శాతం అంధత్వం కలిగిన బాల బాలికలు అర్హులని తెలిపారు. కరీంనగర్ జిల్లా కేందరంలోని శాతావాహనయూనివర్సిటీ ఎదురుగా మల్కాపూర్ రోడ్డులో ఉన్న అంధుల పాఠశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9440550345, 9701190124, 9700457939లో సంప్రదించాలన్నారు.



అక్రమ కట్టడాల కూల్చివేతలు

- కొనసాగుతున్న పనులు
- పక్షపాతం లేకుండా ఆక్రమణలన్నీ తొలగింపు
- డ్రైనేజీల వరకు రోడ్ల విస్తరణకే ప్రాధాన్యం
- సెల్లార్లపైనా దృష్టిసారించాలంటున్న ప్రజలు

మంచిర్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో ఇంతకాలం ప్రభుత్వ భూములు, ఫుట్‌పాత్‌ల్లో ఏర్పాటు చేసుకున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఇరువైపులా డ్రైనేజీల వరకు రోడ్ల విస్తరణకే ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నారు. జిల్లా కేంద్రంలో రోజు రోజుకూ విస్తరిస్తున్న ఆక్రమణలపై ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు రోడ్ల స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు అధికారులు ఇప్పటికే వాటికి మార్కింగ్ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు మార్కెట్ రోడ్డులో ఉన్న ఆక్రమణలన్నీ తొలగించగా, ప్రస్తుతం ఆ ప్రాంతం విశాలంగా దర్శనమిస్తోంది. ఇంతకాలం మార్కెట్‌లో మోటార్ సైకిల్‌పై ప్రయాణించేందుకే ఇబ్బందులు తలెత్తేవి. ప్రస్తుతం ఆ రోడ్డు గుండా ఇరువైపులా కార్లు తేలిగ్గా ప్రయాణించగలుగుతున్నాయి.

అలాగే బెల్లంపల్లి చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు ఆక్రమణల తొలగింపు ఇప్పటికే పూర్తికాగా, జడ్పీ బాలికల పాఠశాల రోడ్డు, వాటర్ ట్యాంక్ ఏరియా, శ్రీనివాస్ టాకీస్ రోడ్డు, హమాలివాడ ఏరియా, వెంకటేశ్వర టాకీస్ రోడ్డు పనులు కూడా పూర్తయ్యాయి. ఆయా ప్రాంతాలన్నీ విశాలంగా దర్శనమిస్తుండగా, ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రస్తుతం విశ్వనాథ ఆలయం రోడ్డులో కూల్చివేత పనులు జరుగుతున్నాయి.

బడా వ్యాపార సంస్థలనూ వదలని వైనం...

ఎమ్మెల్యే ఆదేశాలతో చిరువ్యాపారులపై కొరఢా ఝుళిపిస్తున్న అధికారులు బడా వ్యాపార సంస్థలపైనా చర్యలు తీసుకుంటారా...? అనే సందేహాలు మొదట్లో వ్యక్తమయ్యాయి. ప్రధానంగా మార్కెట్ రోడ్డులో బడా షాపింగ్ మాల్స్ పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటికి ఆనుకొని నిర్మించిన మెట్లు దాదాపుగా ఫుట్‌పాత్‌ను ఆనుకొని నిర్మించారు. అవి తొల గిస్తే గానీ ఆక్రమణలు పోయి, రహదారులు...

మిగతా 7వ పేజీలో..

సంవత్సరాలుగా పాతుకుపోయారు...!

జిల్లా కేంద్రంలో దాదాపు 15 సంవత్సరాలుగా ఫుట్‌పాత్‌లను ఆనుకొని వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. అందులో చిరువ్యాపారులు టేలాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుండగా, కొందరు రాజకీయ నాయకులు సైతం తమ చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి. ఫుట్‌పాత్‌లను ఆనుకొని, వ్యాపారాలకు అనువుగా ఉండే స్థలాలపై కన్నేసిన నా యకులు తమ పలుకుబడితో వివిధ ప్రాంతాల్లో విచ్చలవిడిగా టేలాలు ఏర్పాటు చేశారు. వాటిని చిరువ్యా పారులకు అద్దెకిస్తూ నెలవారీ అద్దె రూపంలో వేలల్లో దోచుకుంటున్నారు. అయినా ఇంతకాలం వాటిపై ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. ఈ క్రమంలో పట్టణంలో ప్రధాన సెంటర్లయిన జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మార్కెట్ రోడ్డు, బాలికల హైస్కూల్, ఐబీ ప్రాంతంతోపాటు టూ టౌన్‌గా పిలవబడుతున్న హమాలివాడలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశా యి. వాటి వెనుక ప్రజాప్రతినిధుల అండ ఉండగా, నెలకు లక్షల రూపాయలు కిరాయిల రూపంలో చేతులు మారుతుండేవి. గతంలో ఏసీపీగా పనిచేసిన విజయ్‌కుమార్ నేతృత్వంలో మున్సిపల్ అధికారులు అక్ర మ టేలాలపై దృష్టిసారించి, తొలగించేందుకు ప్రయత్నించినా, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు.



సీఎంను కలిసిన మంత్రి వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు/మందమర్రిటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి కుటుంబ సమేతంగా మంగళవారం హైద్రాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలంగాణ సచివాలయంలోని మినిష్టర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మంత్రితోపాటు ఆయన తనయుడు పెద్దపల్లి ఎంపీ వంశీక్రిష్ణలు పాల్గొన్నారు.

చివరి లబ్ధిదారుడి వరకు బియ్యం పంపిణీ

బ్రహ్మారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



"లబ్ధిదారులు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మూడు నెలల కోటా సన్న బియ్యం ఒకే సారి పంపిణీ చేస్తున్నాము. అయిపోతాయేమో మాకు దొరకవేమో అని తొందర పడాల్సిన అవసరం కూడా లేదు. చివరి లబ్ధిదారుడి వరకు బియ్యం అందిస్తాం. మూడు నెలల బియ్యం ఒకే సారి పంపిణీ చేస్తున్న సమయంలో కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక లోపాల కారణంగా కొంత ఆలస్యం కావచ్చేమో కాని లబ్ధిదారుడికి అంద కుండా ఉండవు. లబ్ధిదారులు డీలర్లకు సహకరించాలని కోరుకుంటున్నాం" అంటూ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇస్తున్నారు. ప్ర జల్లో ఎప్పటి వరకు ఇస్తారనే ఆందోళన ఉంది? సరిపడా స్టాకు ఉందా?

అధికారి : జిల్లాలో చివరి లబ్ధిదారుడి వరకు సన్నబియ్యం రేషన్ దుకా ణాల ద్వారా అందించేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో అందరికీ బియ్యం అందిస్తాము.

ఆంధ్రజ్యోతి : ఇప్పటి వరకు ఎంత మందికి బియ్యం పంపిణీ చేశారు?

అధికారి : జిల్లాలో 2,23,844 రేషన్ కార్డు దారులు ఉండగా ఇప్పటి వరకు 1,30,493 కార్డు దారులకు బియ్యం పంపిణీ చేశాం. 64.82 శాతం పంపిణీ జరిగింది.

ఆంధ్రజ్యోతి : బియ్యం ఎప్పటి వరకు పంపిణీ చేస్తారు?

అధికారి : ఈ నెలాఖరు వరకు వంద శాతం పూర్తి చేస్తాం. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి : సన్న బియ్యం పక్కదారి పడితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు.?

అధికారి : రేషన్ దుకాణం డీలరు, లబ్ధిదారులు సన్నబియ్యం అమ్మితే తెలంగాణ ప్రజా పంపిణీ వ్యవస్థ చట్టం ప్రకారం సెక్షన్ 17(డీ) ప్రకారం రేషన్ డీలరు షాపు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. లబ్ధిదారుడి కార్డు కూడా రద్దే చేసే అవకాశాలు ఉంటాయి.

-మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న మున్సిపల్ అధికారులు

మంచిర్యాలక్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఒక మార్పు ఒక అభివృద్ధికి మలుపు అనే నినాదంతో వందరోజుల కార్యచరణలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అధికారులు, సిబ్బంది మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల ఆధ్వర్యంలో సుమారు 45 మంది రక్తదానం చేశారు. అనంతరం ఫుడ్ మేళాను నిర్వహించారు. మెప్మా ఎస్‌హెచ్‌జీ తయారు చేసిన గుట్టలు, క్లాత్ బాగ్స్, లేడీస్ పర్సులు, సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 50 అంశాలకు సంబంధించి కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు మేనేజర్ విజయ్‌కుమార్, సానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. వైకుంఠం, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జేఏఓ అనితాదేవి, ఇంజనీర్ ప్రశాంత్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంఘం నిరసన ప్రదర్శన



బీసీ సంఘ నాయకుల నిరసన

నస్పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ముందే బీసీలకు రిజర్వేషన్ 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో తాము అధికారంలోకి వస్తే బీసీలకు రిజర్వేషన్ ప్రక్రియను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఐదేళ్లలో బీసీల సంక్షేమాన్ని లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గొల్ల కుర్మ హక్కుల పోరాట సమితి అధ్య క్షులు రాజన్న యాదవ్, నాయకులు భీంసేన్, రాములు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



ఎంపీ వంశీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతకాని మహర్‌సేవా సంఘం నాయకులు

మంచిర్యాలక్రైం, జూన్17 (ఆంధ్రజ్యోతి): నేతకాని మహర్ కులస్థులకు నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి అన్నారు. సోమాజిగూడ హైదరాబాద్‌లో ఎంపీ వంశీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నేతకాని కులస్థులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నేతకాని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సిద్దార్థ రామ్మూర్తి, నాయకులు మధునయ్య, గోమాస శ్రీకాంత్, గట్టు శివలింగు, దుర్గం చరణ్ దాస్, రాజేశ్, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి



మందమర్రిలో ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

మందమర్రిటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులందరు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కోల్‌బెల్ట్ రోడ్డుపై విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వాహన దారులందరు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి, వేగంగా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ఈ విషయాలను తల్లిదండ్రులకు, బంధువులకు వివరించాలన్నారు. విద్యార్థులు వాహనదారులకు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, జూన్17 (ఆంధ్రజ్యోతి): అర్హులైనవారందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగవారం పట్టణంలోని పదవ వార్డులో మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేసి మాట్లాడా రు. నియోజకవర్గంలో 3500 ఇళ్లను మంజూరు చేశామని మరో విడతలో పూర్తి స్థాయిలో మంజూరవుతాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లతో పేద వారికి గూడు సాకారం అవుతుందన్నారు. ఇల్లు నిర్మించుకున్నవారికి నాలుగు విడతల్లో 5లక్షల రూపాయలు మంజూరవుతాయని, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా జరిగిందన్నారు. అనంతరం పట్టణంలోని గాంధీ విగ్రహం నుంచి పోచమ్మ దేవాలయం వరకు రూ.2కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే కన్నాల బస్తీలో కోటి రూపాయల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు, పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ఎఎంసీ చౌరస్తా వరకు రూ.2కోట్ల నిధులతో రహదారి వెడల్పు పనులు, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరిక్రిష్ణ, నాయకులు కారుకూరి రాంచందర్, ముచ్చర్ల మల్లయ్య, సిలుముల శంకర్, మునిమంద రమేశ్, గెల్లి రాజలింగు, రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడతున్న ఏఐఏడబ్ల్యూయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఏఐఏడబ్ల్యూయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల జీవితాలతో చెలగాట మాడుతున్నాయన్నారు. ఇళ్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామానికి 5 లేదా 10 ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకుంటోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండతో ఫారెస్టు అధికారులు జిల్లాలో తాతాముత్తాల నుంచి భూములు సాగు చేసుకుంటున్న రైతులను భూములు సాగు చేయనివ్వకుండా అడ్డుకుంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. జిల్లాలో ఉపాధి హామీపనులు చేసిన కూలీలకు 5 నెలలుగా కూలీ డబ్బులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ప్రజల సమ స్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ, నాయకులు అశోక్, సా రంగపాణి, రాజారాం, రాజలింగు, సమ్మక్క, శంకర్, వెంకటి, పరమేష్, బాదిరావు, రవి, రాజేశం, రవి పఆల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్

కన్నెపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రం 1లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆయన పాల్గొని అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా చేరిన పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సమయ పాలన పాటించాలని, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాము, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఇందిర, విష్ణుప్రియ, ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జైపూర్ : మూడు నుంచి 6 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత పేర్కొన్నారు. మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఇందారం 4వ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువు, పెరుగుదల పర్యవేక్ష ణ చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి, స్వప్న, వీవో అధ్యక్షురాలు రాజేశ్వరి, ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్‌లు కళ్యాణి, నళిని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

శ్రీరాంపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి, మావోయిస్టులతో చర్చలు జర పాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జాతీయ నాయకుడు వేమనపల్లి వెంకట రామయ్య అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి, హోంమంత్రి ఉద్దేశ పూర్వకంగానే మావోయిస్టులను పట్టుకొని చంపుతున్నారని, అడవుల్లో ఉన్న ఖనిజాల కోసం ఈ మారణకాండను కొనసాగిస్తు న్నారని దుయ్యబట్టారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని రాబోయే రోజుల్లో అన్ని పార్టీలను కలుపుకొని ఢిల్లీలో ధర్నా చేపడతామని అన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర నాయకుడు టి. శ్రీనివాస్, నాయకులు లాల్‌కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్, మల్లన్న, జాఫర్, చాంద్‌పాషా, శ్రీకాంత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సత్వర వ్యాధి నిర్ధారణే నివారణకు మార్గం

జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

హాజీపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిర్ధారణే క్షయవ్యాధి నివారణకు మార్గమని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. మంగళవారం ముల్కల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిర పర్యవేక్షణకు వచ్చిన డాక్టర్ సుధాకర్ నాయక్ రోగులతో ప్రజలతో మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణ కోసం అవగాహన కల్పిస్తూ రెండు వారాలకుపైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా అనుమానించాలన్నారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధినిర్ధారణ తెమడ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ చికిత్స పూర్తయ్యేవరకు ప్రతి నెల రూ. వెయ్యి చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని అన్ని రకాల పోషకాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమం అని తెలిపారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యురాలు లహరి, సాయిప్రసన్న, సౌమ్య, రాము, రజిత, హెచ్ ఈవో రఘుపతి, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, నాందేవ్, జిల్లా ప్రోగాం కోఆర్డినేటర్ సురేందర్‌లు పాల్గొన్నారు.

అతిసార నిరోధక అవగాహన ర్యాలీ



నస్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

నస్పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అతిసార వ్యాధి నిరోధక అవగాహన కార్యక్రమంలో భాగంగా నస్పూర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం (తీగల్‌పహాడ్)లో మంగళవారం అతిసార వ్యాధి నిరోధక అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జూలై 31వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. తీగల్‌పహాడ్ ఉప కేంద్రం వద్ద నుంచి జాతీయ రహదారి వెంట వైద్యాధికారులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య శాఖ ఉప వైద్య అధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృపాబాయి, ప్రో గ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్, డాక్టర్ సమత, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్‌వో రమేశ్, వెంకటేశ్, సునిల్ పాల్గొన్నారు.

79,250 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ

ఆసిఫాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం వరకు 79,250 మంది రైతుల ఖాతల్లో రూ.74,33,70,870 రైతు భరోసా కింద జమ అయినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరానికి రూ.6 వేల చొప్పున ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. బ్యాంకుఖాతాల సమస్యలు ఉన్న 37 మంది రైతులకు సంబంధించి రూ.2,75,587 నిలిపి వేశామని తెలిపారు. వారి వివరాలను ఏఈవోలకు తెలియజేశామని పేర్కొన్నారు. ఏఈవోలు రైతుల బ్యాంకు వివరాలు తెలుసుకుని రైతు భరోసా లాగిన్‌లో పొందు పరుచను న్నారని తెలిపారు. రైతు భరోసా కింద సమస్యలు ఉంటే ఏవో, ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

నగల బ్యాగ్ అప్పగింత

మంచిర్యాలక్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీటీ ఎక్స్‌ప్రెస్‌లో మిస్సైన నగల బ్యాగును జీఆర్‌పీ పోలీసులు బాధితుడికి అప్పగించారు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ జస్పాల్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం వంశీ అనే ప్రయాణికుడు విజయవాడ నుంచి మంచిర్యాలకు జీటీ ఎక్స్‌ప్రెస్‌లో మంచిర్యాలరైల్వే స్టేషన్‌లో దిగే క్రమంలో పిల్లలను ట్రైన్ నుంచి దించే సమయంలో ట్రైన్ వెళ్లిపోయింది. మంచిర్యాల జీఆర్‌పీ పోలీసులకు వంశీ ఫిర్యాదు చేయగా మంచిర్యాల జీఆర్‌పీ పోలీసులు సిర్పూర్ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించడంతో అదే ట్రైన్‌లో ఉన్న కానిస్టేబుల్ శ్రీనుకు సమాచారం అందించడంతో అతని బ్యాగును గుర్తించి బాధితుడికి అందించారు. బ్యాగులో పదితులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి వస్తువులను వంశీకి అందజేశారు. బ్యాగును అందించినవారిలో జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్ గౌడ్, సిర్పూర్ కానిస్టేబుల్ మహేశ్ ఉన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

జైనూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనులను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రా మీణ ఉత్కర్ష్ అభిమాన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో 102 గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పా రు. దీని కోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు ప్రజలకు దగ్గర్లోనే ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసి గిరిజనులకు పీఎం జుగా కార్యక్రమం అమలు చేస్తామన్నారు. గిరిజనులకు పీఎం జుగా కార్డులను అందజేసి వారిని చైతన్య పరిచి పథకాలు వినియోగించుకునేలా చేస్తామన్నారు. గిరిజనులకు జిల్లా పాలన అధికారి, ఐటీడీవే పర్యవేక్షణలో అభియాన్ పథకంలో సర్వే నిర్వహించామన్నారు. ఇందులో 102 హ్యాబిటేషన్లు గుర్తించామని తెలిపారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ మండలంలోని ఆశపెల్లి గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో పీఎం జుగా పథకంపై చర్చించారు. పీఎం జుగా పథకం గిరిజన గ్రామాల్లో సమర్థవంతంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్సీఈఆర్పీలు ఉయిక శంకర్, చవ్హాన్ రవిందర్‌లను ఆదేశించారు. సమావేశంలో డీడీ రమాదేవి, ఎంపీడీవోలు రాంచందర్, కృష్ణారావ్, ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజన ఆవాసాల్లో మౌలిక సదుపాలు

లింగాపూర్ జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆవాసాల్లో మౌలిక సదుపాలు, గిరిజన కుటుంబాల సామాజిక ఆర్థిక భరోసాకు పీఎం జుగా పథకం వరంగా నిలుస్తుందని ఎంపీడీవో రామచందర్ అన్నారు. మండలంలోని వంకామద్ది గ్రామంలో మంగళవారం పీఎం జుగా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా విద్యుత్ లేని గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటారని అన్నారు. వైద్యం, విద్య, కనెక్టివిటీ రోడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించనున్నామని అన్నారు. ఈపథకం ద్వారా గ్రామాల అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రజనీకాంత్ రెడ్డి, టీడబ్ల్యూప్రత్యేకాధికారి కనక బుచ్చిరాం, పంచాయతి కార్యదర్శి జగదిష్‌తో పాటు ఆయా శాఖాల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కార్మికక్షేత్రం.. ఆహ్లాదకరం

● హరిత తోరణంలా గోలేటి ● మొక్కలు నాటి సంరక్షిస్తున్న యాజమాన్యం

రెబ్బెన, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మిక కుటుంబాలు నివసించే ప్రాంతాలు పచ్చదనంతో ఆహ్లాదం కలిగిస్తున్నాయి. బెల్లంపల్లి ఏరియాలో ఎక్కడ చూసినా హరితమయంగా మారాయి. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని భావించిన సింగరేణి యాజమాన్యం ఏటా లక్షల్లో సంఖ్యలో మొక్కను నాటుతూ పరిరక్షణకు చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా మొక్కలు ఏపుగా వచ్చి ఆహ్లాదకరంగా కన్పిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన వనాలను కూడా ఏర్పాటు చేసింది. కాలుష్య నివారణతో పాటు కార్మిక కుటుంబాలు ఆహాదకరాన్ని సమకూర్చుతోంది.

● పచ్చని చెట్లతో సింగరేణి ఉద్యానవనం

గోలేటిటౌన్ షిప్‌లోని సింగరేణి ఉద్యానవనం పచ్చని చెట్లతో నిండిపోయింది. రకరకాల మొక్కలతో పాటు సువాన వెదజల్లే పూల మొక్కలు సందర్శకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు. కార్యాలయంలో పని చేసే సిబ్బంది కాసేపు చెట్ల కింద సేద తీరిన తరువాతే విధుల్లోకి వెళుతున్నారు.ఈ వనంలోకి అడుగు పెట్టగానే పచ్చని చెట్లు స్వాగతం పలుకతాయి. నిత్యం చిన్న పిల్లలతో పాటు పెద్దలు కాలక్షేపం కోసం ఇక్కడికి వస్తుం టారు. ఎత్తైన చెట్లతో పాటు పూలను చూస్తూ ఆనంద పడిపోతుంటారు. హరితహరాన్ని సంరక్షించుకోవటానికి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి సిబ్బందితో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. గోలేటిలోని కోదండ రామాలయం ఆవరణలో ఉన్న చెట్లు చల్లటి నీడతో పాటు మంచి వాతావరణాన్ని అందిస్తాయి. మొక్కలు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు, పూజల అనంతరం కాసేపు చెట్ల కింద సేద తీర్చుకుంటున్నారు.

గోలేటి సీఈ ఆర్ క్లబ్, షటిల్ కోర్టు, ఆఫీసర్ క్లబ్, గెస్ట్ హౌస్, కార్మికులు, అధికారుల క్వార్టర్ల పరిధిలో పచ్చని చెట్లు ఆకర్షిస్తున్నాయి. క్లబ్‌లో వివిధ శుభ కార్యాలయాలు చేసుకునే వారికి ఆహ్లాదకరమైన వాతావరణంలో పలుకరిస్తా యి. సీఈఆర్ క్లబ్‌లోకి వెళ్లే ముఖ ద్వారం నుంచి మొదలుకొని భవనంలోకి వెళ్లే వరకు ఇరువైపులా పచ్చని చెట్లు చక్కటి నీడనిస్తాయి. దీంతో పాటు సింగరేణి డిస్పెన్సరీ, కార్మిక వాడల్లో రహదారికిరువైపులా పెరిగిన చెట్లు చక్కటి వాతావరణాన్ని అందిస్తున్నాయి.





సింగరేణి రోడ్డు పక్కన, జీఎం కార్యాలయం వద్ద కనువిందు చేస్తున్న మొక్కలు

టీజీఎండీసీ ద్వారా ఇసుక సేకరించాలి

ఆసిఫాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులలో ఉపయోగించే ఇసుకను టీజీఎండీసీ (తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా సేకరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఖనిజ, గనుల శాఖ, నీటి పారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇసుక సేకరణపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే ప్రభుత్వ అభివృద్ధి పనులు నీటి పారుదల శాఖ ప్రాజెక్టుల నిర్మాణం, భవన నిర్మాణాలు, వంతెనలు, కాలువలు, రహదారులు, సింగరేణి, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులకు ఉపయోగించే ఇసుకను తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సేకరించాలన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు అవసర మయ్యే ఇసుక కోసం ఆన్‌లైన్ ద్వారా ఇండెంట్‌లు సమర్పించాలని చెప్పారు. జీరో పర్మిట్ ద్వారా క్వారీల నుంచి మెటల్ తరలించాలని, జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ గంగాధర్‌రావు, పీవో రవీందర్, రోడ్లు భవనాల శాఖ అధికారి సురేందర్, పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్, నీటి పారుదల శాఖ ఈఈలు గుణవంతరావు, ప్రభాకర్, గిరిజన సంక్షేమ వాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు విలువలు కలిగిన గుణాత్మక విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్‌లో మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల అడ్మిషన్లకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ ప్రాంత బాలికల కోసం తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ గురుకుల కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజన తదితర సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

బెల్లంపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ అనే వ్యక్తి దగ్గర నకిలీ పత్తివిత్తనాలు పట్టుకున్నట్లు తాళ్లగురిజాల సీఐ అఫ్జలోద్దీన్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ వెంకటనారాయణ అనే వ్యక్తి బుచ్చయ్యపల్లి గ్రామ శివారులో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాడు. ఆంధ్రప్రదేశ్‌లోని చిలుకలూరిపేట గ్రామానికి చెందిన జగన్ అనే వ్యక్తి వద్ద నుంచి 25కిలోల నకిలీ పత్తివిత్తనాలు కొనుగోలు చేశాడు. ఈ విత్తనాలను ఇతర రైతులకు విక్రయించే సమయంలో సమాచా రం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుకున్న నకిలీ విత్తనాలను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఒంటరితనం భరించలేక ఒకరి ఆత్మహత్య



బుచ్చయ్య(ఫైల్)

లక్షెట్టిపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జెండ వెంకటాపూర్ గ్రామానికి చెందిన వెల్తపు బుచ్చయ్య (49)అనే వ్యక్తి ఒంటరితనం భరించలేక ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం బుచ్చయ్య భార్య గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందింది. ఉన్న ఒక్కగా నొక్క కూతురు అనూషకు రెండు నెలల క్రితం వివాహం చేశాడు. అప్పటి నుంచి మృతుడు బుచ్చయ్య ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. ఇంట్లో ఎవరూ లేకపోగా ఒంటరితనం వల్ల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 30న మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో తీవ్ర మనస్థాపానికి గురై మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకో గా గమనించిన స్థానికులు కూతురుకు సమాచారం అందించి లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్షెట్టిపేట వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేపించారు. హైదరాబాద్ ఆసుపత్రిలో బుచ్చయ్య ఆరోగ్యం వై సహకరించకపోవడంతో వైద్యులు ఇంటికి తీసుకు వెల్లమని చెప్పడంతో కుటుంబీకులు మంచిర్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమార్తె వెల్తపు అనూష పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకుండా తిప్పితే చర్యలు

దండేపల్లి జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు ఫిట్‌నెస్ (సామర్థ్యం)లేకుండా రోడ్డుపై తిరిగితే కఠిన చర్యలు తప్పవని లక్షెట్టిపేట సీఐ డి. రమణమూర్తి అన్నారు. మంగళవారం దండేపల్లి మండలంలోని మేదరిపేటలో కాకతీయ, బ్రిలియంట్, కన్నెపల్లిలో మదర్ థెరిసాతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన స్కూల్, కళాశాల బస్సులను రామగుండం సీపీ ఆదేశాల మేరకు, డీసీపీ, ఏసీపీ సూచన మేరకు దండేపల్లి ఎస్సై తహసీనోద్దీన్‌తో కలిసి వాహనాలకు సంబంధించిన ఫిటినెస్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన భీమా, తదితర రికార్డులను తనిఖీలు చేపట్టి పత్రాలను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ పాఠశాల బస్సు డ్రైవర్లు రోడ్డుభద్రతా నియమాలు పాటించాలన్నారు. ఫిటినెస్ లేకుండా రోడ్డుపై తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీలో ఎస్సై తహసీనోద్దీన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



బస్సు పత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై తహసీనోద్దీన్

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

నస్పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని అన్ని ప్రాంతాల అధ్యక్షుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశం యూనియన్ నాయకులు చెల్ల విక్రం, ఆవుల సుధాకర్ ఆధ్వర్యంలో పట్టణ సమావేశం నిర్వహించగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కమిటీ లక్ష్యంగా పని చేయాలని నిర్ణయించారు. ఆటో డ్రైవర్‌కు ఏదైన సమస్య ఉంటే అక్కడికి వెళ్లి పరిష్కారం చేయాలని సూచించారు. రాజకీయాలకు సంబంధం లేకుండా ఆటో కార్మిక సంఘం పని చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా నస్పూర్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పులి రాజేందర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాగిడి రాజు, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి రాజు కుమార్, సహాయ కార్యదర్శిగా రామన్న, మరో 15 మంది కమిటీ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

వాంకిడి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పర్‌గొంది గ్రామానికి చెందిన రాథోడ్ ప్రేందాస్ ఫోన్ పోగొట్టుకోడంతో గుర్తించి మంగళవారం అందజేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ప్రేందాస్ ఇటీవల ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేసినట్లు తెలిపారు. మొబైల్‌ను గుర్తించిన కానిస్టేబుల్ నయీంను ఎస్సై అభినందించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

సిర్పూర్(టి), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భూభారతిలో నమోదు అయిన కొత్త రైతు పట్టాదారులు ఈ నెల 20 వరకు వ్యవసాయ శాఖ కార్యాలయంలో పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్‌లను జత పరిచి రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో గిరీష్‌కుమార్ అన్నారు. భూభారతిలో నమోదైన కొత్త పాసు పుస్తకాల గల రైతుల నుంచి మంగళవారం రైతు భరోసా కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశం కేవలం కొత్త పట్టాపాసు పుస్తకాలు కలిగిన రైతులకు వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చింతలమానేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురికి మంజూరైనా సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. కర్జవెల్లి గ్రామానికి చెందిన బూసి రామక్కకు రూ.43,500, రౌతు రాజన్నకు రూ.22,500, పాలె దేవక్కకు రూ.10,500, సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆదేశాల మేరకు అందజేశారు. కార్యక్రమంలో నానయ్య, కల్పన, రంగన్న, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాల స్వర్ణోత్సవాలను

వైభవంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న మందమర్రి జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆ పాఠశాలకు సంబంధించి స్వర్ణోత్సవాల థీమ్‌సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వేడుకలకు సింగరేణి ఉన్నతాధి కారులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిర పడ్డారని, వారు కూడా హాజరవుతారని చెప్పారు. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాలతో విద్యాభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. థీమ్ సాంగ్‌లో పాఠశాలల విలువలు, విద్యా విధానం ప్రతిబింబించేలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటి కార్యదర్శి గుండ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ సునీల్‌కుమార్, పాఠశాల కరెస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపల్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గనులపై వారం రోజులపాటు యోగా శిబిరాలు

రెబ్బెన, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని అన్ని గనుల విభాగాల్లో యోగా శిక్షణ శిబిరాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నామని జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఉపరితలగని, ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, గోలేటి సీహెచ్‌పీలో యోగాపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. నిత్యం అరగంట పాటు యోగా చేయడంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని తెపాఆరు. కార్యక్రమంలో యోగా శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మి, ఆలేఖ్య, ఎస్ఓటు జీఎం రాజమల్లు, అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహర, ఏరియా ఇంజనీర్ రామనాథం, డీజీఎం(సివిల్) ఎస్‌కె మదీనా భాష, ఫైనాన్స్ మేనేజర్ ఎం.రవికుమార్, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి రోజు యోగా సాధన చేయాలని డీజీఎం(పర్సనల్) ఎస్ అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని విభాగాలు, గనులలో 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు యోగా సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్ట్రాటా కంట్రోల్ అధికారులు శ్రీధర్, అమర్‌నాథ్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, యోగా గురువు సాంబయ్య, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



గోలేటిలో యోగా చేస్తున్న జీఎం ఎం విజయభాస్కర్‌రెడ్డి, పాల్గొన్న ఉద్యోగులు



కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం

ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ



ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పాల్గొన్న సహాయ కార్యదర్శి భీమనాధుని సుదర్శన్

మందమర్రిటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులకు హక్కులు సాధించి పెట్టే ఏకైక తమయూనియనే అని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయ కార్యదర్శి భీమనాధుని సుదర్శన్ అన్నారు. స్థానిక ఏరియా వర్క్‌షాపులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వాట్సాప్‌లకే పరిమితమైన సంఘాలు తమ యూనియన్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి మందమర్రికి రాగా సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించామని చెప్పారు. పెరిక్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యమే చెల్లించేలా చూడాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల నిర్వహిస్తున్న స్ట్రక్చర్ సమావేశాల్లో సమస్యలను ప్రశ్నించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగరేణికి బకాయి పడ్డ 40 వేల కోట్లను సంస్థకు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ చూడాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము పన చేస్తున్నామని చెప్పారు. ఇతర సంఘాల నాయకులు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు సోంశెట్టి రాజేశం, కంది శ్రీనివాస్, ఎగ్గేటి రాజేశ్వర్‌రావు, పెద్దపల్లి బానయ్య, తిరుపతి, గాండ్ల సంపత్, కుమార్, ఓదెలు, రాజేష్, శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేతలు..!

(5వ పేజీ తరువాయి)

పూర్వపు కళను సంతరించుకొనే అవకాశం ఉండేది. అయితే పలుమార్లు బడా షాపింగ్ కాంప్లెక్స్‌ల మెట్లు తొలగించేందుకు అధికారులు ప్రయత్నించినా, ఒత్తిళ్ల కారణంగా అవి సఫలీకృతం కాలేదు. కేవలం చిరు వ్యాపారులపైనే తమ ప్రతాపం చూపించేవారు. దీనికి భిన్నంగా పక్షపాత ధోరణిని విడిచి డ్రైనేజీల వరకు అన్ని ఆక్రమణలను తొలగిస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆక్ర మణలను సైతం త్వరగా తొలగిస్తే మంచిర్యాల నగరం సర్వాంగ సుందరాంగ తయారవుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.

● సెల్లార్లను ఖాళీ చేయించాలి..

జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ప్రస్తుతం వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకపోయినా, బహుళ అంతస్థుల భవనాల సెల్లార్లనూ ఖాళీ చేయించాలనే డిమాండ్లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో విపరీతమైన ట్రాఫిక్ కారణంగా పలు రోడ్లు కిక్కిరిసి పోతున్నాయి. ఈ క్రమంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా తయారైంది. ముఖ్యంగా పండుగల దినాలలో పరిస్థితి మరింత జఠిలంగా మారుతోంది. బహుళ అంతస్థుల భవనాల్లో ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. భవనాల సెల్లార్లలో పార్కింగ్‌కు స్థలం వదిలివేయాల్సి ఉండగా, యజమానులు వాటిని కూడా అద్దెకు ఇవ్వడంతో వాహనాలు రోడ్డుపైన నిలపాల్సి వస్తోంది. ఎప్పటికప్పుడు సెల్లార్లను ఖాళీ చేయించడం ద్వారా పార్కింగ్ ఇబ్బందులు తొలగిస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతుండగా, భవనాల యజమానులు సెల్లార్ల రూపంలో లక్షల్లోకి రాయలు దండుకుంటున్నారు. ప్రస్తుతం అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నందున సెల్లార్ షాపింగ్‌లపైనా దృష్టి సారించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. సెల్లార్లను ఖాళీ చేయించి, పార్కింగ్ ఏర్పాటు చేస్తే రోడ్లపై వాహనాలు నిలిపే అవకాశం ఉండదు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలత్తెకుండా ఉండే అవకాశం ఉంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోటపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి అటవీ శాఖలో బేస్ క్యాంపు సిబ్బందిగా పనిచేస్తున్న అశోక్ (25) మంగళవారం ఉదయం మృతిచెందాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 11న మండలంలోని పంగిడిసోమారం అటవీ ప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. నెన్నెల మండలం ఖర్జీకి చెందిన అశోక్‌కు భార్య మమత, తల్లిదండ్రులు ఉన్నారు. కోటపల్లి అటవీ శాఖ రేంజర్ సదానందం, సిబ్బంది అశోక్ మృతి పట్ల సంతాపం తెలిపారు.

మోదీ పాలనలో దేశం గర్వించేలా అభివృద్ధి

దండేపల్లి జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రదాని మోదీ పాలనలో దేశంలో 11 ఏళ్లలో అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని 11ఏళ్ల సుపరిపాలన జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. వికసిత్ భారత్ వికసిత్ 11 సంవత్సరాల సూపరిపాలన సందర్భంగా దండేపల్లిలో బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల సమ్మకానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు రవిగౌడ్, సంతోష్, అనిల్, మండల ప్రభారీ రమణారావు, నాయకులు రాజయ్య, గురువయ్య, కిషన్, మల్లేష్ ఉన్నారు.

అనగనగా.. సుమంత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. అందులో సుమంత్ ఉపాధ్యాయుడిగా నటించి ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాడు. పిల్లలకు తేలికగా అర్థమయ్యేలా పాఠాలను ఒక కథ రూపంలో చెబుతాడు. అయితే సుమంత్ ఈ సినిమాలో చేసిన ప్రయోగం విద్యార్థులకు మంచి మార్కులు తెప్పించి శభాష్ అనిపించుకుంటాడు.. అయితే మందమర్రి పట్టణంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడా ఈ సినిమాలోలాగా విద్యార్థులకు సులువైన పద్ధతిలో పాఠ్యాంశాలు చెబుతూ..ఔరా అనిపిస్తున్నాడు..

బాగుంది సారూ.. బోధనా తీరు..


విద్యార్థులతో వరినాట్లు వేయిస్తూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

వినూత్న బోధనతో విద్యార్థులను చైతన్యపరుస్తున్న ఉపాధ్యాయుడు

వరి నాట్ల నుంచి మొదలుకొని విమానాల గురించి వివరిస్తూ..

ఆకట్టుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్


ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ..

మందమర్రి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) :మందమర్రి పట్టణంలోని కేకే 5 ఫిల్టర్ బెడ్ ఆంగ్ల బోధన ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న జెల్లంపల్లి శ్రీనివాస్ విద్యార్థులకు తేలికగా పాఠాలు ఎలా మెదడుకు ఎక్కాలనే ఆలోచనతో తన విధులు నిర్వహిస్తున్నాడు. ఏదో వచ్చామా ఒక పాఠం చెప్పామా అని కాకుండా తనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలనే ఉద్దేశ్యంతో సదరు ఉపాధ్యాయుడి బోధన తీరు ఉంటోంది. ప్రతి క్లాస్‌లోనూ వినూత్న విద్యా బోధనతో విద్యార్థులను ఆకట్టుకుంటున్నాడు. విద్యార్థుల ఆలోచన విధానానికి అనుగుణంగా పాఠాలు బోధిస్తూ మంచి ఫలితాల సాధనే లక్ష్యంగా పని చేస్తున్నాడు. విధుల పట్ల అం కిత భావంతో విద్యా వ్యాప్తి ధ్యేయంగా తోటి ఉపాధ్యాయులకు ఆదర్శ ప్రాయుడుగా నిలుస్తున్నాడు.

సామాజిక అంశాలను వివరిస్తూ..

పాఠశాలలో సమయ పాలన పాటి స్తూ విద్యార్థులకు ఒక స్నేహితుడిలా ఉంటూ చక్కని బోధన తీరుతో విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నాడు. అన్నం పెట్టే అన్నదాత నుంచి మొదలుకొని ఆకాశంలో ఎగిరే విమానం గురించి కూడా వివరి స్తున్నాడు. సామాజిక అంశాలపై కూడా వివరిస్తు న్నాడు. 1 నుంచి 5 తరగతి వరకు 170కి పైగా ఆంగ్ల బోధన విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుడు స్కూల్ డ్రెస్ ధరించి పాఠశాలకు రావడం, మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ అందరికతో కలిసిపోతూ ఉంటున్నాడు.

ప్రధానంగా మనం తినే తిండి ఏ ఎలా పండుతుందో పొలాలకు వెళ్లి ఏకంగా విద్యార్థులతో కలిసి నాట్లు వేయించాడు. అదే విధంగా సోలార్ ప్లాంటుల గురించి అక్కడకు తీసుకెళ్లి వివరించాడు. అంతే కాకుండా సింగరేణిలో కార్మికులు బొగ్గు ఉత్పత్తి చేసే విధానంపై కూడా విద్యార్థులకు వివరిస్తున్నాడు. మనిషికి ప్రధాన అవయవాలు ఏంటి.. వాటి పనితీరు ఎలా ఉంటుంది. ఇలా వీటిపైనా పిల్లలకు అర్థమయ్యే రీతిలో తెలుపుతున్నారు.

పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నుంచి మొదలు పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నాడు. కేవలం జీతం తీసుకుంటే సరిపోదు విద్యార్థుల ఉన్నతికి కూడా పాల్పడాలనేది సదరు ఉపాధ్యాయుడి లక్ష్యం. అందుకే రొటీన్‌గా కాకుండా పిల్లలకు సబ్జెక్టు ఎలా అర్థమవుతుంది అనే దానిపై శ్రద్ధ తీసుకుని ముందుకు సాగుతున్నాడు. కేవలం పిల్లలను పైకి తేవడం ఒకటే కాకుండా పాఠశాలకు మంచి పేరు తెచ్చేందుకు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ చేస్తున్న కృషి మెచ్చుకోతగ్గదే. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 2025 విద్యా సంవత్సరానికిగాను 12 మంది ఆదర్శ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో సీట్లు సాధించా రంటే ఇక్కడ బోధన తీరు ఉందో అర్థం చేసు కోవచ్చు.



ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన విద్య బోధన: జెల్లంపల్లి శ్రీనివాస్, ఎస్‌జీటీ

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య బోధన అందుబాటులో ఉంది. ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌తో పాటు ఉత్తమ ఫలితాల సాధనకు అంకిత భావంతో పని చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఉన్నత ఫలితాలకు కృషి చేయడం, సామాజిక అంశాలపై చైతన్యం కల్పించడం, ప్రధానంగా ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాల్లో అవగాహన కల్పిస్తున్నారు. తోటి ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది.


విద్యార్థులను చేర్పించాలని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

రైతు భరోసా కోసం నమోదు చేసుకోవాలి

మందమర్రిరూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్నందున రైతు భరోసా కోసం రైతులందరు నమోదు చేసు కోవాలని ఏఈవో ముత్యం తిరుపతి ఒక ప్రకటనలో కోరారు. గత యాసంగి నుంచి ఇప్పటి వరకు నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు, పట్టదారు పాసు పుస్తకాలు ఉండి రైతు భరోసాలో నమోదు కాని రైతులు, బ్యాంకు పాసు పాసు పుస్తకాల్లో వివరాలు తప్పుగా నమోదైన రైతులు ఈ నెల 20లోపు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసుపుస్తకాలతో రైతు వేదికల్లో సంప్రదించాలన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు మంగళ వారం కలెక్టరేట్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట మల్లేష్ యాదవ్, చింతకింది మధుసూదన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో మొండి వైఖరి ప్రదర్శిస్తోందని, ఇది సరైంది కాదన్నారు. అక్రిడిటేషన్ కార్డులను స్టిక్కర్ల విధానంతో పునరుద్ధరించడం కాకుండా కొత్త కార్డులు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టులు రాజేష్, లక్ష్మణ్, జీవన్‌బాబు, అహ్మద్ పాల్గొన్నారు.

ముగిసిన మారెమ్మ జాతర

కోటపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలపల్లి గ్రామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న మారెమ్మ జాతర మంగళవారం ముగిసింది. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు మంచిర్యాల, మందమర్రి, చెన్నూరు, బెల్లంపల్లి నుంచి భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. భక్తులకు మాజీ సర్పంచు తోట స్రవంతి సౌకర్యాలు కల్పించారు. మంగళవారం రథయాత్రతో జాతర ముగిసింది.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా ఖలీందర్ ఆలీఖాన్



మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ పట్టణ కార్యదర్శిగా ఖలీందర్ అలీఖాన్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన మహాసభల్లో పట్టణ కార్యదర్శిగా కలీందర్ ఆలీఖాన్‌ను, సహాయ కార్యదర్శిగా చాడ మహేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభల విజయవంతానికి కృషి చేస్తామన్నారు. శంకరయ్య, రాజేశం, కనకలక్ష్మీ, యాదగిరి పాల్గొన్నారు.

కాకా చౌరస్తాగా నామకరణం చేయాలని వినతి

నస్పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ముఖద్వారమైన ఇందారం చౌరస్తాకు దివంగత మాజీ కేంద్ర మంత్రి కాక వెంకటస్వామి నామకరణం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తోకల సురేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఇందారం చౌరస్తాకు కాక పేరు నామకరణంతో పాటు చౌరస్తాలో కాక విగ్రహం పెట్టించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, జూన్17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికిగాను హకీం పేట్ స్పోర్ట్స్ స్కూల్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశానికి గాను ఎంపిక పోటీలను స్థానిక కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం 18న క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర్ స్వామి తెలిపారు. ప్రవేశ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు 01-09-2016 నుంచి 31-09-2017 మధ్య జన్మించిన వారు అర్హులు. ఈ క్రీడా పోటీల్లో హాజరయ్యే విద్యార్థులు టీజీఎస్ఎస్ తెలంగాణ. జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని ప్రింట్ కాపీతో రావాలని సూచించారు. వివరాల కోసం 9441594878 పీడీ రాజన్నను సంప్రదించాలన్నారు.

నేడు మండల స్థాయి సెలెక్షన్లు

నెన్నెల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం బుధవారం నెన్నెలలో మండల స్థాయి సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పాటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 10 గంటల వరకు స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌కు చేరుకోవాలని కోరారు. విద్యార్థులు ధృవీకరణ పత్రాలతో సకాలంలో హాజరు కావాలని ఎంఈవో కోరారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లిజూన్ 17 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలోని ఖాళాగా ఉన్న రెండు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గంటల ప్రతిపాధి కన పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రామగిరి రమేష్ మంగళవారం ఓప్రక టనలో కోరారు. పీజీటీ గణితం, పీజీటీ హింది పోస్టుల అభ్యర్థులు అర్హుత పత్రాలతో ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'క్షుద్రపూజలు, చేతబడులు లాంటివి నమ్మవద్దు'

కాసిపేట, జూన్17 (ఆంధ్రజ్యోతి): క్షుద్రపూజలు, చేతబడులు అంతా అబద్ధం ఇలాంటి ఎవరు నమ్మవద్దని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలో రెండు రోజులుగా క్షుద్రపూజలు కలకలం రేపుతుండగా మూఢనమ్మకాలతో మానసిక, శారీరక రుగ్మతలకు గురికాకుండా ఉండేందుకు స్థానిక ప్రజలకు ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్న మూర్ఖత్వం నిరక్షరాస్యత, వెనుకబాటుతనం తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాల కారణంగా కొంత మందిలో మూఢనమ్మకాల ప్రభావం అధికంగా ఉందన్నారు. నేటి హైటెక్ సమాజంలో కూడ క్షుద్రపూజలు ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం బాధాకరమన్నారు. మంత్రతంతాలు, గుప్త నిదుల పేరుతో క్షుద్రపూజలు, చేతబడి, బానమతి వంటిమూఢనమ్మకాలు ప్రజలను ఇంకా వేదిస్తున్నాయన్నారు. కాని వీటిని నమ్మి ప్రజలు భయాందోళ నలకు గురికావద్దన్నారు. మూఢ నమ్మకాలపై ప్రభుత్వం అవగాహన కల్పిస్తున్నప్పటికీ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటివి ఇంకా కొనసాగడం బాధాకర మన్నారు. ప్రజలు చైతన్యవంతులై వాస్తవికతను ఆలోసించి భయ భ్రాంతులకు గురికావద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లను అమ్ముకుంటున్నారు'

కాసిపేట, జూన్17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం పేదోడి సొంతింటి కలను నిజం చేసేందుకు తెచ్చిన ఇందిరమ్మ ఇళ్లను కొందరు నాయకులు డబ్బులకు అమ్ముకుంటున్నారని బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మల్కపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నీడ కల్పించేందుకు ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల జాబితాను విడుదల చేసింది. అర్హులకు కాకుండా అనర్హులను ఎంపిక చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి, రెండో లిస్టులో ఉన్న పేర్లు కాకుండా డబ్బులు ఇచ్చినవారి పేర్లనే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఇచ్చారన్నారు. ఇప్పటికైన అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పునరాలోచించి అర్హులకే ఇండ్లు కేటాయించాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ మల్కపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు మహేందర్, నాయకులు అనిల్, మామిడిసాగర్, వినోద్, కాంపెల్లి సురేశ్, సతీష్, రజనికాంత్, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిలోనైనా సమస్యలు పరిష్కరించండి

అధికారులకు తంగళ్లపల్లి గ్రామ రైతుల వినతి


రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న తంగళ్లపల్లి రైతులు

భీమిని, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : భూభారతి లోనైనా మాభూముల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామ సభలో తంగళ్లపల్లి గ్రామ రైతులు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. గ్రామంలో మోఖాపై ఒకరు, భూ రికార్డుల్లో మరొకరి పేర్లు ఉండటంతో భూసమస్యలు ఏర్పాడ్డాయని విన్నవించారు. అప్పటి తాజా మాజీ సర్పంచు, అధికారులు గ్రామంలో రైతుల వద్ద 40 లక్షల వరకు రూపాయలను భూసమస్యలకు పరిష్కరిస్తామని మేరాలు మాట్లాడుకుని వీటిలో రూ.20 లక్షల వరకు డబ్బులను తీసుకుని అనామకులైన పేర్లను భూ రికార్డుల్లో నమోదు చేశారని రైతులు ఆరోపిస్తూ ఈ సమస్యలను రెవెన్యూ అధికారులకు మంగళవారం రెవెన్యూ సదస్సులో రాతపూర్వకంగా వినతి పత్రం అందించారు. దీనిలో ప్రభుత్వంలో భూ ప్రక్షాలన, ధరణి రాకతో ఆ గ్రామం రైతుల భూ సమస్యల్లో కూరు కుపోయామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు లేక బ్యాంకు రుణాలకు నోచుకోక, అప్పటి ప్రభుత్వంలో రైతుబంధు ప్రస్తుతం రైతుభరోసాలు రావడం లేదని, కొత్తగా ప్రవేశపెట్టబోయే భూభారతి లోనైనా తంగళ్లపల్లి గ్రామ రై తుల సమస్య పరిష్కారం లభిస్తుందని తంగళ్లపల్లి రైతులు రెవెన్యూ సదస్సులో అధికారులకు మొరపెట్టుకున్నారు. ఏళ్లుగా సాగు చేస్తున్న పట్టా భూములకు పాస్‌పుస్తకాలు ఇవ్వక పోవడంతో ఆ రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమ వుతున్నామని అన్నారు. భూ సమస్య పరిష్కరించాలని అధికారుల చుట్టూ... నాయకుల చుట్టూ తిరుగుతున్నా ఏళ్లగా తమ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. గ్రామంలో సర్వే నంబరు 1 నుంచి 59 వరకు 300 ఎకరాల పెద్ద పట్టా, 300 ఎకరాల లావణి పట్టా భూమి ఉందని గత తెలంగాణ ప్రభుత్వం కొత్త పాసు పుస్తకాలు జారీ చేయక ముందు వీరికి పట్టాలు ఉండేవని రెవెన్యూ అధికారులకు తెలిపారు. భూములకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేక పోవడంతో రెవెన్యూ అధికారులు ఆ 600 ఎకరాల భూములను డిస్యూట్‌లో పెట్టారని రెవెన్యూ సదస్సులో వారు పిర్యాదు చేశారు.

భూభారతి చట్టం లోనైనా మా గ్రామ భూ సమస్యలను పరిష్కరించాలని రైతులు రెవెన్యూ అధికారులకు మోరపె ట్టుకు న్నారు. ఈ కార్యక్రమంలో డీటీ గోవర్ధన్, సీనియర్ అసిస్టెంట్ దాగాం కొండయ్య, గ్రామంలో రైతులు పాల్గొన్నారు.

పూర్వప్రాథమిక విద్యతోనే పిల్లల ఎదుగుదల


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక

కాసిపేట, జూన్17 (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్య పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తతిరుమలాపూర్‌లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్య క్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మండలంలో అమ్మ మాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే అంగన్ వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరభ్యాసకార్యక్రమాన్ని నిర్వహిసున్నాం. అంగన్ వాడీ కేంద్రాల ఆవశ్యకతను గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. 3 నుంచి 5ఏళ్ల లోపు పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రాల్లోకి పంపించాలని సూచించారు. అనంతరం మంచి అలవాట్లలో భాగంగా పిల్లలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. సూపర్‌వైజర్ రాధిక కూతురు వేదాన్షిపుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. కేక్‌కట్ చేసి సహపంక్తి భోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిడాం అంబారావు, అంగన్‌వాడీ టీచర్ గేడెం లలిత, ఆయా లక్ష్మీ, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీబీజీకెఎస్ ఏరియా ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం

నస్పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన బండి రమేష్‌ను మంగళవారం నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ ఘనంగా సన్మానించింది. నూతనంగా ఉపాధ్యక్షుడిగా బండి రమేశ్ ఎన్నికైన సందర్భంగా శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కూరి సుబ్బయ్య, పట్టణ కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, నాయకులు వంగ తిరుపతి, గోగుల రవీందర్‌రెడ్డి, ఆకునూరి సంపత్, గుమ్మడి శ్రీనివాస్, పొగాకు రమేశ్, రాజేశ్వర్ రెడ్డి, రఫీక్‌ఖాన్, దుర్గప్రసాద్, రాజు కుమార్, సోహేల్, కాటం రాజు, జాడి భానుచందర్, దగ్గుల మధు, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయలో సీటు

బెల్లంపల్లి, జూన్17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల సెంటర్ ఎక్స్‌లెన్సీ విద్యార్థి సాయిచరణ్ జవహర్ నవోదయలో సీటు సాధించిన ట్లు ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్ తెలిపారు. సాయి చరణ్ బెల్లంపల్లిలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించారని నిజాంసాగర్ కామారెడ్డిలో ఉన్న జవహర్ నవోదయలో ఈ విద్యా సంవత్సరానికి ఇంటర్ మీడియట్‌లో సీటు సాధించి ప్రవేశం పొందాడన్నారు. అధ్యాపకులు సాయిచరణ్‌ను అభినందించారు.

భూ భారతి చట్టంతో భూములకు భద్రత

దండేపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా రైతుల భూములకు భద్రత లభిస్తుందని మండల తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అన్నారు. మంగళవారం మండలంలోని వెల్గపూర్. నర్సాపూర్‌లోని రెవెన్యూ సదస్సు ద్వారా భూ సమస్య పరిష్కరం కోసం రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రైతులకు భూ హక్కులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూభారతి చట్టం, సాదా బైనామా, పీవోటీ, భూ విస్తీర్ణంలో మార్పులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 83 మంది రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, ఆర్ఐ భూమన్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రామకృష్ణాపూర్,జూన్17(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ మంచిర్యాల గోల్డెన్ జుబ్లీ, లయన్స్‌క్లబ్ ఆఫ్ రామకృష్ణాపూర్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి మంగళవారం విశేష స్పందన లభించింది. వైద్యులు సుగుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కంటి సమస్య ఉన్నటువంటి వారికి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ ఉచితంగా చేయనున్నట్లు లయన్స్ క్లబ్ రామకృష్ణాపూర్ అధ్యక్షులు రాజేశ్‌కన్నా అన్నారు. 150 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 28 మందిని ఆపరేషన్ నిమిత్తం ఈ నెల 30న రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఆడెపు లక్ష్మణ్, కిష్టయ్య, పాల్గొన్నారు.

భైరవస్వామికి డీసీపీ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న డీసీపీ భాస్కర్


కోటపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపెల్లి కాలభైరవ స్వామికి మంగళవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్న వీరు పూజలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారీ రాజేష్‌తో పాటు కమిటీ సభ్యులు డీసీపీ, ఏసీపీలకు స్వాగతం పలికారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

బెల్లంపల్లి, జూన్17 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి చేసి ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో ఈసెట్ కౌన్సిలింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ పాలన సాగిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పట్టణంలోని ఇందిరమ్మ ఇండ్ల కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కాలనీలో డ్రైనేజీలు, రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు కేటాయించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో నాగుపాము


కార్యాలయంలో ఉన్న నాగుపాము

చెన్నూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆరు అడుగుల పొడవున్న కోడె నాగు పాము మంగళవారం కలకలం రేపింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉండే గదిలోకి నాగు పాము వెళ్లడాన్ని అప్పటికే కార్యాలయానికి చేరుకున్న అటెండర్ జ్ఞానేశ్వర్ గుర్తించారు. వెంటనే ఆయన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్‌కు సమాచారం అందించడంతో పాములు పట్టే వారిని పిలిపించి పామును పట్టి అటవీ ప్రాంతంలో వదిలేశాడు. అటెండర్ పామును చూడడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

- రెన్యూవల్ కోసం ఎదురుచూపు
- 12 ఏళ్లుగా పని చేసినా ఉద్యోగ భద్రత కరువు
- అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీ
- సర్కార్ కనికరించాలని వినతి

'అతిథి' అయోమయం



ఆసిఫాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అతిథి అధ్యాపకులు తమ ఉద్యోగాల రెన్యూవల్‌కు ఆశగా వేచి చూస్తున్నారు. జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమైనా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేక పోవడంతో వారి పరిస్థితి అయోమయంగా మారింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి రాష్ట్రంలో 2012 వరకు కాంట్రాక్టు వ్యవస్థలో అధ్యాపకులను తీసుకున్నారు. ఆ తరువాత కాంట్రాక్టు వ్యవస్థలో తీసుకోవడం ఆపివేసి అతిథి అధ్యాపకులంటూ పీరియడ్ వ్యవస్థను 2013లో అప్పటి ప్రభుత్వం తీసుకు వచ్చింది. కళాశాలలో పదవీ విరమణ, పదోన్నతులతో ఖాళీలను అతిథి అధ్యాపకులతో భర్తీ చేసుకుంటూ వస్తున్నారు. తాజాగా గత ఏడాది సర్కారు ఏకబిగిన ప్రభుత్వ కళాశాలల్లో 1,254 జూనియర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేసింది. ఇంక వీరి అవసరం లేదనట్లుగా ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రాష్ట్రంలో 2013 నుంచి అతిథి అధ్యాపకులుగా పని చేస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురించింది.

● గత ఏడాది వరకు..

రాష్ట్రంలో ఉన్న మొత్తం 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,654 మంది అతిథి అధ్యాపకులుగా గత సంవత్సరం వరకు కొనసాగారు. కుమరం భీం జిల్లాలో ఉన్న 11 జూనియర్‌కళాశాలల్లో 61 మంది పని చేస్తున్నారు. ఇందులో ప్రస్తుతం 45 మంది అధ్యాపకుల పరిస్థితి అయోమయంగా మారింది. గత ఏడాది జూనియర్ అధ్యాపకుల భర్తీ ప్రక్రియలో 1,250 మంది అధ్యాపకులను ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో ఒకేషనల్ గ్రూపులలో పని చేస్తున్న 350, జనరల్ గ్రూపుల్లో పని చేస్తున్న 150 మంది అతిథి అధ్యాపకులు మాత్రమే రాష్ట్ర వ్యాప్తంగా మిగిలారు. ప్రస్తుత ఏడాది 20 జూనియర్ కళాశాల అదనంగా రాగా వాటిలో మరో 200 మంది వరకు చోటు దొరికే అవకాశం ఉంది. వీరంతా పోనూ ఇంకా వెయ్యి మంది బయటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

● పీరియడ్ల ప్రాతిపదికన..

ప్రభుత్వ కళాశాల అభివృద్ధి కోసం పీరియడ్ల ప్రాతిపదికన గరిష్ఠంగా నెలకు రూ.28,080 వేతనంతో 12ఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేక పోకింది. ప్రస్తుతం వ్యవస్థలో నుంచి తమను వెళ్లగొట్టడం తీరని అన్యాయం చేయడమే అవుతుం దని అతిథి అధ్యా పకులు ఆవేదన చెందుతున్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ విద్యావ్యవస్థల బతోపేతానికి కృషి చేస్తున్నామని, భద్రత కల్పించాలని కోరుతున్నారు.

● ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్నా..

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న 1,654 మంది అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 12 నెలల రూ.42 వేల జీతం అందిస్తామని ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అతిథి అధ్యాప కులు, వారి కుటుంబాలు ఎంతో సంతోషం వ్యక్తం చేయగా అది మూడునాళ్ల ముచ్చటగానే మిగిలింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గతంలో పెండింగ్‌లో ఉన్న జేఎల్ నోటిఫికేషన్‌లో భాగంగా పరీక్ష నిర్వహిం చి అధ్యాపకులను భర్తీ చేసింది. దీంతో అతిథి అధ్యాప కులు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం అటు మంత్రులు గానీ ఇటు ఉన్నతాధికారులు కానీ పట్టించుకోక పోవడంతో తమ పరిస్థితి ఏంటని అతిథి అధ్యాప కులు ఆందోళన చెందుతున్నారు. అతిథి అధ్యాపకులు తమ సమస్యకు సంబంధించి మంత్రులను కలవగా వారు అండగా ఉంటామని చెబుతున్నారు. కమిషనర్ స్థాయి అధికారులు కూడా ఇదే సమాధానం చెబుతున్నారు. కానీ కళాశాలలు ప్రారంభమైన 15 రోజులు గడుస్తున్నా ఎటువంటి నిర్ణయం లేకపోవడంతో అతిథి అధ్యాపకుల్లో ఆందోళన నెలకొంది.

● ఇలా చేస్తే కొంత మేలు..

రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు అధికంగా ఉన్నారు. వీరిలో అద నంగా ఒక్కొక్క పోస్టు పెంచినట్లయితే అతిథి అధ్యాపకులకు కొంత మేలు జరుగుతుంది. పలు కళాశాలల్లో రెండేళ్లుగా ఆంగ్ల మాధ్యమం తరగతులు సైతం కొనసాగుతు న్నాయి. వాటికి ప్రత్యేకంగా పోస్టులు మంజూరు చేస్తే అతిథి అధ్యాపకులకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఈ దిశగా ఆలోచించి తమకు తిరిగి ఉపాధి కల్పించాలని అతిథి అధ్యాపకులు కోరుతున్నారు. ప్రజా ప్రభుత్వం అని చెబు తున్న కాంగ్రెస్ సర్కారు తీసుకునే నిర్ణయం కోసం వీరు వేచి చూస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ హామీ నెరవేర్చాలి..

- శ్రీనివాస్, అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నెరవేర్చాలి. ప్రభుత్వం నూతన అధ్యాపకుల నియామకంతో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికి పైగా కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిం ది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభు త్వం నూతన అధ్యాపకుల ను భర్తీ చేసిన చోట డిస్టర్బ్ అయిన వారిని, ఎక్కువగా స్ట్రెంత్ ఉన్న చోట రెండో పోస్టు సృష్టించి భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ సూచనలు పాటించాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని విత్తనా లు, ఎరువుల దుకాణాన్ని మంగళవారం తనిఖీ చేశారు. నిల్వలు రశీ దు పుస్తకం, రిజిస్టర్, ఎరువుల గోదాంను పరిశీలించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంచే గుర్తించబడిన విత్తనాలు, ఎరువులను రైతులకు నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలని అన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు ఉంటా యని హెచ్చరించారు. దుకాణం ఎదుట ధరల పట్టిక, దుకాణంలోని నిలువ వివరాలు ప్రదర్శించాలని సూచించారు. రైతులకు విక్రయించిన ప్పుడు తప్పని సరిగా రశీదు ఇవ్వాలన్నారు. రైతులు రశీదులను జాగ్రత్తగా తమ వద్ద భద్ర పర్చు కోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఏవో మిలిం ద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆల్బర్ట్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో పీఆర్ఏఈ ఆత్మారాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోష్, కార్యదర్శు లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జాబితా విషయంలో న్యాయం పాటించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్యను కలిసేందుకు వెళ్లగా తనపై దురుసుగా ప్రవర్తించారని, సమగ్ర విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని మంగళవారం తెలంగాణ ఉద్యమ కారుడు తాజ్ బాబా సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు న్యాయం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

సిర్పూర్(టి), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట గ్రామ పంచాయతీలో మంగళవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇళ్లు మంజూరైన ఎనిమిది మంది లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య మాట్లాడారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లిస్తుందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతి, శంకర్, తిరుపతి, పురుషోత్తం, మోతీరాం, రత్నాకర్, సంతోష్ హౌసింగ్ ఏఈ శజియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జైనూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఢబోలి గ్రామానికి చెందిన హెంఎం మేస్రాం జంగు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షుడు పెందూర్ ప్రకాష్, జిల్లా సీనియర్ నాయకుడు మేస్రాం అంబాజీరావ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పంద్ర షేకు, పెందూర్ లచ్చు, ఉయిక చందన్‌శావ్, దండుగుల మహేష్, సుద్దాల ఆనంద్, సుద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక తరగతులు

- పాఠశాలలను పరిశీలించిన డీఈవో యాదయ్య
- మండలాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించిన ఉపాధ్యాయులు



కెరమెరిలో వివరాలు తెలుసుకుంటున్న డీఈవో యాదయ్య

కెరమెరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో దివ్యాంగులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని డీఈవో యాదయ్య అన్నారు. సావర్‌ఖేడ యూపీఎస్, కెరమెరి ఉన్నత పాఠశాల, ఝరి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, సుల్తాన్‌గూడ పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రత్యేక తరగతుల నిర్వహిస్తామని తెలిపారు. వారికి రీడర్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్‌లు, రవాణా ఖర్చులు చెల్లిస్తామని తెలిపారు. స్పచ్ తెరపీ, ఫిజియోథెరపీ తదితర వసతులు పాఠశాలల్లో కల్పిస్తామని తెలిపారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో ప్రకాష్, ఉపాధ్యాయులు రంగయ్య, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం బడిబాటలో భాగంగా విలీన విద్యా దినోత్సవం కార్యక్రమం నిర్వహించి ఇద్దరు దివ్యాగ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో పేర్లు నమోదు చేయించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ ఎంఈవో వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ విలీన విద్యా దినోత్సవం నిర్వహించి ఇద్దరు దివ్యాగ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో పేర్లు నమోదు చేయించామని చెప్పారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు లభించే సౌకర్యాలు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఐఈఆర్‌పి సతీష్, స్వరూప, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు విభిన్న ప్రతిభావంతులను(దివ్యాంగులను) గుర్తించడంతోపాటు వారిని పాఠశాలలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో ఎంఈవో కుడ్మేత సుధాకర్ మాట్లాడుతూ ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వనరుల గదిలో దివ్యాంగులను బోధించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో శివచరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసిన పిల్లలను వ్యవసాయ పనులకు పంపించకుండా పాఠశాలల్లో చేర్పించాల న్నారు. దివ్యాంగులైన విద్యార్థులను స్థానిక భవిత కేంద్రంలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం నటరాజ్, వినేష్, సీఆర్పీ విజయ్, సునీల్, ఐఈ ఆర్‌పీ తిరుమల, ఉపాధ్యాయులు రాజమల్లు, సతీష్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటి టౌన్ షిప్‌లో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటేశ్వర్ మాట్లాడుతూ సమగ్ర విద్య మీద అవగాహన కల్పిస్తూ, అన్ని వర్గాల పిల్లలకు సమాన విద్య అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గజ్జల లావణ్య, ప్రశాంత్, సౌజన్య, సుజాత పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం శరీరానికి కానీ మనసు కాదని ఆత్మ విశ్వాసం ఉంటే ఎవరైనా అద్భుతాలు సాధించవ్చని ఎఫ్ఆర్వో శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో భవిత కేంద్రంలో నిర్వహించిన ఇంక్లూజీవ్ ఎడ్యుకేషన్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఇంక్లూజీవ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ మధుకర్, ఎంఈవో అంజయ్య, ఐఈఆర్‌పీ సుమన్, కుమార్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి భవిత సెంటర్‌లో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల బడిబాట కార్యక్రమంలో భాగంగా సమ్మిళిత విద్య, బాలికల విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు ప్రత్యేక బోధన, అలవెన్స్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, భాగ్యలక్ష్మి, అశ్విని, ఐఈఆర్‌టీ సుజాత పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు సమానమైన విద్యను అందిస్తామని ఐఆర్పీ సుమన్ అన్నారు. మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ పీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటాపాటలతో కూడిన విద్య



గోలేటిలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రెబ్బెన, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వా డీ కేంద్రాల్లో పిల్లలకు ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఆసిఫాబాద్ ఇన్‌చార్జి సీడీపీవో తిరుపతమ్మ తెలిపారు. రెబ్బెన మండలం గోలేటిలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యస కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. పౌష్టికాహారాన్ని అందించటంతో పిల్లల్లో మానసిక పరిపక్వత వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, సుశీల, స్వర్ణలత, మంజుల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి పాఠశాలలో చేర్పించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు స్వప్న, రమశ్రీ, పార్వతి, తిరుపతమ్మ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సన్మానం



జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న శ్యాంనాయక్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 17: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికృష్ణారావును మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబా ద్ నియోజ కవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ హైదరాబాద్‌లో మర్యా దపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెల కొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట నాయకులు రావి శ్రీనివాస్, సుదర్శన్‌గౌడ్, రవి నాయక్ తదితరులు ఉన్నారు.

జీవో 49ని ఉపసంహరించుకోవాలి



రెబ్బెనలో జీవో ప్రతులను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెన, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీవో 49ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజ్ రాంబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జీవో 49 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల అటవీ భూములను కుమరం భీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ జీవో 49 విడుదల చేశారని అన్నారు. ఈ జీవోతో గ్రామ రహదారి సౌకర్యం, పాఠశాలలు, భవన నిర్మాణాలకు అంతరాయం కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లాప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శి రామగిరి సతీష్, మండల కార్యదర్శి సచిన్ జైశ్వాల్, కోశాధికారి మధూకర్, మహేందర్‌గౌడ్, సంతోష్, ముంజల వెంకన్నగౌడ్, చౌదరి సాయి పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో 49ని వెంటనే ఉప సంహరించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధురాజ్, పార్టీ మండల అధ్యక్షుడు మేస్రాం జ్ఞానేశ్వర్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ 49 జీవోను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిలర్ గోపాల్, నాయకులు దిలీప్‌కుమార్, నగేష్, నిర్దుడె జనార్దన్, సంతోష్, అంకుష్, జంగు, రమేష్ పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాను టైగర్ కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ విడుదల చేసిన జీవో 49ను ఉపసంహరించుకోవాలని తహసీల్దార్‌కు బీజేపీ నాయ కులు వినతి పత్రం అందజేశారు. అనంతరం జీవో 49 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, సంతోష్, కాంతా రావు, నాగేష్, రాజన్న, వైకుంఠం, భాస్కర్, నానయ్య, రవి, కిషన్, తుకారాం, ప్రభాకర్, శ్రీను, ప్రభాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో 49ని వెంటనే ఉపసంహరించుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా జీవో ప్రతులను దహనం చేశారు. వెంటనే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దిగంబర్, వసీఖాన్, తిరుపతి, రాజారాం, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీవో 49ని ఉపసంహరించుకోవాలని బీజేపీ నాయకుల వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లావణ్య, మహేష్, ఎన్ లావణ్య, అశోక్, నాని, కుమారస్వామి, గురుదాస్, మహేష్, శేఖర్, మారుతి, నాగేందర్, బాలాజీ, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. మహాసభలకు పెద్ద సంఖ్యలో నాయకులు, కౌన్సిల్ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, నర్సయ్య, చిరంజీవి, సీతారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ